# చిత్తశుద్ధిలేని మానవుడు ఆత్మతత్త్వమును ప్రబోధించడానికి అర్హుడు కాడు

చిత్తశుద్ధి లేని క్షుద్ర మానవునకు
ఆత్మతత్త్వమెట్లు అబ్బునొక్కొ?
ఆత్మతత్త్వమబ్బు అతి శుద్ధబుద్ధికే
ఉన్నమాట తెలుపుచున్న మాట.

ప్రేమస్వరూపులారా!

ఆత్మతత్త్వము సాధించవలెననే ఆశ గల్గినవాడు, సాధించి దానిని అన్యులకు ప్రబోధించాలనే ఆశ కల్గిన మానవుడు మొట్టమొదట చిత్తశుద్ధిని గావించుకోవాలి. చిత్తశుద్ధిలేని మానవుడు ఆత్మతత్త్వము ప్రబోధించే అర్హుడుకాడు. ఆత్మతత్త్వముకూడా తాను తెలుసుకోలేడు. వెలుగులేని గదియందే విషక్రిములైన పాములు, తేళ్లు ప్రవేశిస్తాయి. వెలుగుతోకూడిన గదిలో యిట్టి విషక్రిములు ప్రవేశించుటకు వీలుకాదు. హృదయమందు పరిపూర్ణప్రేమ కల్గినవానికి కామక్రోధమదమాత్సర్యములనే విషక్రిములు అందులో ప్రవేశించుటకు వీలుండదు. ఎవని హృదయమందు పరిశుద్ధమైన, పవిత్రమైన ప్రేమ ఉండదో అట్టివాని హృదయమందే ఈ రాగద్వేషములు ప్రవేశిస్తాయి.

## చిత్తశుద్ధి కలగాలంటే నిరంతర భగవన్నామస్మరణకు మించిన సాధన లేదు

మానవత్వము పరిశుద్ధమైన హృదయముగా, పవిత్రమైన హృదయముగా ప్రేమమయమైన హృదయముగా, దయామయమైన హృదయముగా అభివృద్ధి గావించుకోవాలి. ప్రతి మానవుని హృదయము దయాహృదయము కావాలి. ప్రేమహృదయము కావాలి. సహనహృదయము కావాలి. సానుభూతి హృదయము కావాలి.

srisathyasaivachanamrutam

సంతోష హృదయము కావాలి. అప్పుడే ఈ పరిశుద్ధమైన ఆత్మతత్త్వము అతనికి సులభంగా అర్థమవుతుంది. అట్టి అర్థము చేసుకున్న ఆత్మతత్త్వమును అన్యులకు ప్రబోధించే అర్హుడవుతాడు. కేవలము విద్యవల్లగానీ, పాండిత్యమువల్లగానీ, మరియు మేధాశక్తివల్లగానీ లభ్యమయ్యేదికాదు, ఈ ఆత్మతత్త్వము. చిత్తశుద్ధియే దీనికి అత్యవసరము. రామకృష్ణ పరమహంస, కబీరు, సూరదాసు యిత్యాది వ్యక్తులందరు ఎట్టి విద్యలు నేర్చిరి? ఎంతటి మేధాశక్తి వారియందుండింది. పండితుడుకాడు, పామరుడు రామకృష్ణ పరమహంస. కానీ అట్టి పామరుడైన రామకృష్ణ పరమహంస పేరు విశాలప్రపంచమందు దేదీప్యమానంగా యీనాడు వెలుగుతున్నదనగా దీనికి కారణము ఏమిటి? చిత్తశుద్ధియే దీనికి మూలకారణము. కనుకనే 'నతపాయ, నతీర్థానాం, నశాస్త్రేణ జపానహి సంసార సాగరోద్ధారే సజ్జనం సేవనం వినా'. ఇట్టి చిత్తశుద్ధి కలగాలంటే తపస్సు చేయనక్కరలేదు. వేదశాస్త్ర, ఇతిహాస పురాణములు పఠించనక్కరలేదు. ఏ జపములు, ఏ ధ్యానములు చేయనక్కరలేదు. భగవంతుని ప్రేమపూర్వకంగా హృదయమందు నిరంతరము స్మరిస్తుంటే యింతకంటె మించిన సాధన మరొకటిలేదు.

**మనస్సు ప్రభావమునకు ఆహారమే మూలకారణము**

ప్రేమగల హృదయమే నిజమైన మానవ హృదయము. ఇట్టి ప్రేమ హృదయం మనలో అభివృద్ధి కావలెనన్న దీనికి పవిత్రమైన, పరిశుద్ధమైన ఆహారపానీయములు అత్యవసరము. మీరు భుజించే ఆహారము స్థూలరూపములో మలముగా విసర్జిస్తున్నారు. సూక్ష్మరూపమైన ఆహారము మానవుని శరీరమందు కండరములవలె, రక్తమువలె రూపొందుతున్నాది. అతిసూక్ష్మమైన ఆహారమే మనస్సుగా మారుతున్నది. కనుక మనస్సు ప్రభావమునకు ఆహారమే మూలకారణము. ఎట్టి ఆహారమో అట్టి మనస్సు. కనుక సాత్త్వికమైన పవిత్రమైన హితమైన మితమైన ఆహారము భుజించటము అత్యవసరము. ప్రాచీనకాలమందు మహర్షులు గ్రామములు విసర్జించి, పల్లెలు విసర్జించి కారడవులలో జీవిస్తూ కందమూలాదులు భుజిస్తూ తమ జీవితములు ప్రశాంతముగా గడుపుతూవచ్చారు. ఆ కందమూలాదులలోని సాత్త్వికతత్త్వము మీకు తెలియదు. రామ, లక్ష్మణ, సీతలు

అరణ్యములో సంచరిస్తూ ఆ అరణ్యఫలములు భుజిస్తూ ఎంతో ఆనందమును అనుభవిస్తూ వచ్చారు. భౌతిక సుఖమునందుగానీ, భౌతిక పదార్థమందుకానీ, భౌతిక విషయములందుగానీ, పంచభక్ష్య పరమాన్నములందుగానీ ఈ ఆనందము చిక్కదు మనకు. దైవముయొక్క సహజ సృష్టితోకూడిన ఈ ఆహారమునే ఫలపుష్పములనే వారు భుజిస్తూ ఆనందము ననుభవిస్తూ వచ్చారు. ఇంక పానీయములు అనగా త్రాగునీరు. నీరుకూడా పరిశుద్ధముగా ఉండాలి. ఈ త్రాగేనీరు స్థూలరూపములో మూత్రముగా విసర్జిస్తున్నారు. సూక్ష్మరూపమే ప్రాణము. మానవునియందున్న ప్రాణము జలముతో ఏర్పడినది. మానవునియందున్న మనస్సు ఆహారముతో చేకూరినది. మానవునికి మనస్సు, ప్రాణము రెండూ ప్రధానమైనవి. ప్రాణముండినంతవరకు మనసుండాలి. మనసుండినంతవరకు ప్రాణముండాలి. అమనస్కుడైన తరువాత ప్రాణముతో అవసరములేదు. నిత్యజీవితములో, సత్యమైన మార్గమును అనుభవించవలెనన్న ఆహారపానీయములు అత్యవసరము. అవి పరిశుద్ధమైనవిగా, పవిత్రమైనవిగా ఉండాలి. మానవుని మనోశక్తి కేవలము భౌతికమైన, ప్రాకృతమైన పదార్థములచేత ఏర్పడినదని భ్రమిస్తున్నారు. భగవంతుని శక్తిసామర్థ్యములు ఎంతో ఆనందముగా తాండవమాడుతూ వచ్చేటువంటిది. హిమతల పర్వతముపై జీవించే శివశక్తులు ఈ ఆహారప్రభావముచే తాండవమాడుతూ వచ్చారు. వారు మాత్రమే కాకుండా భక్తులనుకూడా తాండవమాడించారు. భక్తులనేకాక జగత్తునే తాండవమాడించారు

**మౌళిగుల్కెడు చంద్రమఃఖండ కళతోడ**
**బెడగారు గుంపెడు జడలతోడ**
**జడలలో ప్రవహించు చదలేటి జిగితోడ**
**దంబైన ఫాలనేత్రంబుతోడ**
**నల్లనేరెడువంటి నల్లని మెడతోడ**
**కరమున నాగకంకణముతోడ**
**నడుమును చుట్టిన నాగచర్మముతోడ**
**మైనిండ నలరు భస్మంబుతోడ**
**నుదుట తీర్చిన దొడ్డ కుంకుమ బొట్టుతో**

sri sathyasai vachanamrutam

**తాంబూల రాగాధరంబుతోడ**
**ఆరు శాస్త్రములందున నందగించి**
**నల్ల కలువల హసియించి కొల్లలాడు**
**మెరుగు చామనచాయ మేనితోడ**
**పర్తివాసుడు నేడు సాక్షాత్కరించె.**

ఈ భగవత్స్వరూపమును శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా, లౌకికంగా ఆనంద ఆహ్లాదమును అందుకొని అనుభవించి పరులకందించాలంటే ఆహారపానీయములే ప్రధానము. కనుక విద్యార్థులు ఈ ఆహారపానీయములందు ఏమాత్రము అశ్రద్ధను చూపకూడదు. మీ భవిష్యత్తంతయు నేడు మీరు స్వీకరించే ఆహారపానీయములపైననే ఆధారపడి ఉంటున్నది.

**ప్రేమలేని స్థానముగాని, ఆనందములేని జగత్తుకాని కంటికి కనిపించదు**

మానవుని దివ్యతత్త్వము గుర్తించాలనుకుంటే ఆహారవిహారములు పరిశుద్ధముగా ఉండాలి. ఇట్టి పరిశుద్ధమైన దానివల్ల పవిత్రమైన ప్రేమ మనలో ఆవిర్భవిస్తుంది. ఈ ప్రేమకు రూపములేదుగానీ అనుభూతులను చక్కగా అందిస్తుంది. పుష్పముయొక్క వాసనకు రూపములేదు. కాని, వాసన అందించే పుష్పమునకు రూపముంది. ఈ ఆనందమునకు రూపములేదుగానీ ఆనందమునందించే ప్రేమకు రూపముంది. ఈ ప్రేమ మన ముఖములందే వర్తింపచేస్తుంది. Reflection of the inner being. మానవుడు ఈ దివ్య ప్రేమతత్త్వమునను భవించే సమయములో తనకు తెలియకనే ఆనందము పొందుతుంటాడు. దానినే 'నిత్యానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం' అని అనేక విధములుగా వర్ణించటం జరిగింది. యీ మూడింటియందున్న ఆనందము, మరొక ప్రాకృత పదార్థమునందుగానీ ప్రాకృతవిషయములందుగానీ, ప్రాకృత కార్యములందుగానీ ఏనాటికి కంటికి కనిపించదు. ఇది నివృత్తియందు మాత్రమే ప్రత్యక్షమవుతుంది. ప్రవృత్తియందు ఏమాత్రము ప్రత్యక్షముకాదు. జాగ్రదవస్థయందు మనసు పరిపూర్ణముగా ఉంటుంది. మనసుండినంతవరకు ప్రకృతి మనకు గోచరమవుతుంది. ప్రకృతి మనకు

srisathyasaivachanamrutam

గోచరమయ్యేవరకు సుఖదుఃఖములు తప్పినవి కాదు. కాబట్టి ఈ సుఖదుఃఖములకు ఏది కారణము? ఈ ప్రకృతి దృశ్యమే కారణము. ఈ ప్రకృతి దృశ్యమునకేది కారణము? జాగ్రదవస్థయే కారణము. నిద్రావస్థయందు మనస్సులేదు, ప్రపంచములేదు, సుఖదుఃఖములుకూడా లేవు. మనస్సు ఉండినప్పుడే ప్రపంచము. ప్రపంచముండినప్పుడే సుఖదుఃఖములు. ఆ మనస్సు ఏవిధంగా చేరిపోవాలి? పానకములో చక్కెర ఏ విధంగా వ్యాపించిందో ఆవిధంగా ఈ దృశ్యకల్పిత జగత్తునందు ప్రేమ ఆవిర్భవించాలి. ప్రేమలేని స్థానముగానీ, ఆనందములేని జగత్తుగానీ కంటికి కనిపించదు. సర్వత్రా ఉండినది ఆనందమే! సర్వవ్యాపకమైనది ప్రేమయే!

**ప్రేమతత్త్వము సర్వప్రాణులందు ఉంటున్నది**

ప్రేమలేక, మానవత్వము లేక జీవత్వము ఉండలేదు. మీకు పూర్వము చెప్పాను. మహాభారతయుద్ధము జరుగుతున్నాది. చాలా భయంకరంగా జరుగుతున్నాది. దీనిని పరికించాలని వ్యాసుడు వస్తున్నాడు. ఆ మార్గమధ్యములో ఒక చిన్న క్రిమి చాలా వేగంగా పరుగెత్తిపోతున్నాది. త్రికాలజ్ఞానియైన వ్యాసుడు రథము నిల్పాడు. దానికి ప్రజ్ఞానశక్తి ప్రసాదించాడు. 'ఏ క్రిమీ! ఎందుకు నీవీవిధంగా పరుగెత్తి పోతున్నావు? ఏమి ఆపత్తు సంభవిస్తున్నాది' అని ప్రశ్నించాడు. 'ఓ మహాప్రభో! మహాభారతయుద్ధం చాలా ఘోరంగా జరుగుతున్నాది. కొన్ని క్షణములలో అర్జునుని రథము ఈ మార్గములో వస్తున్నాది. అతని రథముయొక్క వేగము యిట్టిది, అట్టిదియని ఎవరు చెప్పలేరు. ఆ రథము రాకపూర్వమే నా ప్రాణము నేను సంరక్షించుకోటానికి వేగంగా వెడుతున్నాను' అంది. ప్రాణమును రక్షించుకోటం క్రిమికీటకాదులకుకూడా ఉంటున్నది. మానవులకు మాత్రమేకాదు. తాము సుక్షేమముగా ఉండాలని క్రిమికీటకాదులకుకూడా ఉంటుంది. మానవులకు మాత్రమేకాదు. ప్రతి ప్రాణికి సుఖము అనుభవించాలి, ఆనందము అనుభవించాలి, పరిపూర్ణమైన తృప్తిగా ఉండాలి అనే ఆశ ఉంటున్నాది. అదియే ప్రేమతత్త్వము. ఆ ప్రేమ సర్వప్రాణులందు ఉంటున్నాది. ఈ ప్రేమ ఎట్టిదిగా ఉంటున్నాది?

**కార్యకారణ సంబంధమే ఈ జగత్తు**

జగత్తును మీరు చూస్తున్నారు. ఒకడు జగత్తును చూచి 'యిది జగత్తు' అని నిర్ణయము చేస్తున్నాడు. ఆధ్యాత్మిక చింతన చేసే ఒక వ్యక్తి 'ఓ మూర్ఖుడా! నీవు చూచేది జగత్తుకాదు. జగదీశ్వరుని చూస్తున్నావు', అన్నాడు. విష్ణువు కారకుడు, జగత్తు కార్యము. కార్యకారణ సంబంధమే ఈ జగత్తు. దైవములేని జగత్తులేదు. కనుక, చూచేదంతా దైవాన్నే! అనగా వారి వారి మనోభావములు పురస్కరించుకొని, వారి వారి విశ్వాసములు పురస్కరించుకొని ఈ విధంగా ఉంటుంది. ఈనాటి విద్యావిధానమునందు, ఈ విశ్వాసము అంత గాఢంగా లేకపోవటంచేత ప్రపంచము అనేక అశాంతులకు గురై అల్లకల్లోలములతో భద్రతలేక చాలా బలహీనతగా కనిపిస్తున్నాది. ఒక పెద్ద మనిషి తన కుమారుని స్కూలులో చేర్చాలని తీసుకువెళ్లాడు. హెడ్మాష్టరును చూచాడు. 'హెడ్మాష్టరుగారు! మా పిల్లవానికి అన్నీ తెలుసు. చాలా తెలివితేటలు గలవాడు. వానికి తెలియనివే లేవు' అని చెప్పాడు. ఆ హెడ్మాష్టరుకూడా తెలివితేటలు కలవాడే! 'అన్నీ తెలిస్తే యిక్కడకెందుకు తీసుకొచ్చారు? ఇంటికి తీసుకువెళ్లండి' అన్నాడు. 'కానీ రెండు తెలియవు' అన్నాడు, తండ్రి. ఏమిటవి? 'ఒకటి చెబితే వినడు, రెండు తాను తెలుసుకోడు', ఈ రెండే! ఈనాటి విద్యావంతుడు నాకన్నీ తెలుసునని విఱ్ఱవీగుతున్నాడు. ఏమిటి తెలుసు? తనను తానే ఎరుగని మూర్ఖుడు జగత్తును గురించి ఏమి చెప్పగలడు?

**యం.యేలు బియ్యేలు ప్యాసయి వచ్చియు**
**పేరుగాంచిన పెద్దవారలైన**
**సంపదలుండియు సద్దానపరులౌచు**
**పుడమి కీర్తిని గన్న పుణ్యులైన**
**ఆయురారోగ్యము లనవరతంబుండి**
**పరిపూర్ణబలులగు వారలైన**
**జపములు తపములు సతతంబు సేయుచు**
**వేదంబులను నేర్చు విప్రులైన**
**సాటిరారు భక్తులకు నేనాటికైన**
**దైవమును గొల్వనిదె రాదు భక్తి**

srisathyasai vahini amrutam

**దైవ భక్తులు కానిదే రాదు ముక్తి**
**ఇంతకన్నను వేరెద్ది యెరుకపరతు**
**సాధుసద్గుణగణ్యులౌ విద్యార్థులారా!**

మనము ఏమో నేర్చుకుంటున్నామనుకుంటున్నాం. ఏమో నేర్చామనుకుంటున్నాం. గొప్ప తెలివితెటలు కలవారమనుకుంటున్నాం. నిజంగా తెలివితేటలు గల్గినవారు ఆ విధంగా భావించరు. తెలివితెటలు లెనివాడే 'నేను గొప్ప మేధావిని' అనుకుంటాడు.

**మానవజన్మ చాలా ఉత్కృష్టమైనది, సౌజన్యసౌశీల్యములు గలది**

దైవప్రీతిని మనం పెంచుకున్ననాడే ఈ జగత్తులో మన జీవితము గొప్పగా ప్రకాశిస్తుంది. మానవుడు ప్రతి దానియందు ఆదర్శప్రాయుడుగా తయారుకావాలి. ముఖ్యముగా ఈ జగత్తునందు ఆత్మతత్త్వమును అర్థము చేసుకోవాలి. ఈ ఆత్మతత్త్వము ప్రతి మానవుని స్వరూపమే! నీ దేహాభిమానం వదలి ఆత్మాభిమానంలో ప్రవేశించు, ఆనందం నీకు ప్రాప్తిస్తుంది. ప్రపంచములో మూడు రకములైన జీవులుంటున్నాయి. నిరంతరము జలములోనే సంచరించే జీవులు కొన్ని. గట్టుపై జీవించేవి కొన్ని. జలములోను, గట్టుపైనా జీవించేవి కొన్ని. అదే విధముగా నిరంతరము ఆత్మచింతనలోనే కాలము గడిపే వ్యక్తులు మహనీయులు, పుణ్యులు కొంతమంది ఉంటారు. కానీ ప్రాకృత జీవితాన్ని గడపుతూ, ఆధ్యాత్మిక జీవితంలో ప్రవేశించి అటు, యిటు కొంతవరకు జీవితాన్ని గడిపేవారు కొంతమంది. ప్రకృతియందు ఒక కాలు, ఆధ్యాత్మికమందు ఒక కాలు, మరికొంతమంది ఉంటారు. ఆధ్యాత్మికమే వారికి గిట్టదు. దాని వాసన ఏమాత్రము అనుభవించలేరు. ఎందుకంటే గాఢమైన అజ్ఞానమనే పడిశము పట్టింది. అలాంటి వారికి సుగంధము అనుభూతికి రాదు. కనుక ఆస్తికనాస్తికయాస్తికతత్వములలో ఉంటారు. జోగి, బైరాగి, విరాగి ఈ విధంగా అనేక రూపములలో జీవిస్తున్నారు. కానీ అన్నింటికంటె ఈ దివ్యమైన మానవత్వము మనకు ప్రాప్తించింది. ఇది అందరికి అన్ని జన్మలలోను ప్రాప్తించేదికాదు. ఎంత అదృష్టముచేతనో ఈ మానవత్వము ప్రాప్తించింది. కనుక 'జంతూనాం నరజన్మ దుర్లభం' మానవ జన్మము చాలా ఉత్కృష్టమైనది, సౌజన్యమైనది, సౌశీల్యమైనది. ఇట్టి



sri sathyasai vachanamrutam

మాణిక్యమువంటి మానవత్వమును మసిబొగ్గులకమ్ముకొనే మూర్ఖులుకూడా ఉంటున్నారు. ఈనాడు లోకములో మాణిక్యము విలువ తెలుస్తే టేబులుపై పెడతాడా? ఒక పేపరు వెయిటుమాదిరి ఉపయోగపెట్టుకుంటాడా? దాని విలువ తెలిస్తే గాడ్రేజిలో పెట్టి లాక్ చేస్తాడు.

## భగవత్ప్రేమ అత్యంత మధురమైనది

మొట్టమొదట ఆత్మతత్త్వము విలువ మనం గుర్తించాలి. రత్నముయొక్క విలువ నీవు గుర్తించాలి. తులసిదాసు నామరత్నమును గొప్ప మణివలె భావిస్తూ వచ్చాడు. ఇది ఎవరిచ్చారు? ఇది కేవలము దైవానుగ్రహముతో లభ్యమయ్యేది! దైవమే ఈ రత్నము. అది దైవముదగ్గర మాత్రమే లభ్యమవుతుంది. మార్కెట్టులో, షాపులో లభ్యమయ్యేదికాదు. దీనికి master God. కనుక, పరమాత్ముని ఆశ్రయించినప్పుడే ఈ రత్నము మనకు లభ్యమవుతుంది. ఈ రత్నము ఎట్లా ఉంటుందో తెలుసునా! వేయిసూర్యులకాంతితో ప్రకాశిస్తుంది. కానీ అదికూడా యింకా తక్కువే. ఆ భగవత్ప్రేమ ఎట్లా ఉంటుందో తెలుసునా? అమృతము ప్రక్కన భగవత్ప్రేమ పెడితే అమృతము చప్పగా ఉంటుందట. ఆ ప్రేమ మధురంగా ఉంటుందట!

**వచనం మధురం నయనం మధురం**
**హస్తం మధురం హృదయం మధురం**
**శ్రవణం మధురం మధురాధిపతే రఖిలం**
**మధురం మధురం...**

నీ శ్రవణమే ఆనందమధురం. వాక్కే మధురమైనది. నీ హృదయమే మధురమైనది. నీ హస్తమే పరమమధురమైనది. అంతా మధురమే! నఖశిఖపర్యంతము సంచరించే రక్తముకూడా మధురమైనదే. ఇట్టి సత్యాన్ని గుర్తించిన వ్యక్తులు ఈ లౌకికమైన, భౌతికమైన, ప్రాకృతమైన, అనిత్యమైన, అశాశ్వతమైన, క్షణభంగురమైన జగత్తును ఏవిధంగా ఆశిస్తారు? ఆ రుచి తెలియనివాడే దీనిని ఆశిస్తాడు. కారణం ఏమిటి? జన్మాంతర దుష్కర్మచేత జ్ఞానహీనుడై పోయినాడు.

## మానవత్వములోని విశిష్టతను గుర్తించాలి

ఈనాటి మానవుడు ధనముకోసం ప్రాకులాడుతున్నాడు, ఉద్యోగంకోసం ప్రాకులాడుతున్నాడు, అధికారంకోసం ప్రాకులాడుతున్నాడు. ఇది అధికమైపోతూ వస్తున్నాది. కానీ, దైవంకోసం ప్రాకులాడటం ఎక్కడా కనుపించటంలేదు.

**ధనమున్నదని ఘనముగా పలికిన**
**పుడమియందిసుమంత శాంతిలేదు**
**విద్యఉన్నదని విఱ్ఱవీగినగాని**
**పుడమియందిసుమంత శాంతిలేదు**
**దుర్బుద్ధులు తలనున్న దూరులు విను చెవులున్న**
**పొంచిచూచు కనులున్న పంచల విను మనసున్న**
**వంచన గుణ చిత్తమున్న వంచించే పలుకున్న**
**ఈ వికృతులు చూడగనే న్యాయమింక బ్రతుకదన్నా**
**ఏ గుణంబును హృదయంబున నిలువదన్నా.**

హృదయమందిరములో ఉంటున్నాది, శాంతి. బయట శాంతిలేదు. అంతా పీసెస్. నిజమైన శాంతికోసం ప్రాకులాడేవానికి సర్వము లభ్యమైపోతాయి. ధనముకూడా వానిని వెతుక్కుంటూ వస్తుంది. సిరిసంపదలంతా వానిని వెతుక్కుంటూ వస్తాయి. భోగభాగ్యములు వానిని వెతుకుతూ వస్తాయి. అధికారకీర్తులు వానిని వెతుకుతూ వస్తాయి. తాను వెతకనక్కరలేదు. తాను గడప దాటనక్కరలేదు. కాలు కదపనక్కరలేదు. కైవల్యము వచ్చి ఒడిలో పడుతుంది. ఏమిటి heaven? డన్‌లప్ బెడ్డు వేసుకొని ఎయిర్‌కండిషన్ పెట్టుకొని మంచి పిల్లోలు వేసుకొని యిదే హాయి యిదే స్వర్గము అనుకోవడమా? ఏమిటి ఈ స్వర్గము? పాప స్వర్గము. ఈ స్వర్గము పాంచభౌతిక శరీరమనుభవిస్తుందిగానీ నీవు కాదు కదా!

**పాంచభౌతికము దుర్బలమైన కాయంబు**
**ఎప్పుడో విడిచేది ఎరుకలేదు**

sri sathyasai vahini amrutam

**శత వర్షములదాక మితము చెప్పిరిగాని**
**నమ్మరాదామాట నెమ్మనమున**
**బాల్యమందో మంచి ప్రాయమందో లేక**
**ముదిమియందో లేక ముసలియందో**
**ఊరనో అడవినో ఉదక మధ్యంబునో**
**ఎక్కడో విడిచేది ఎఱుక లేదు**
**మరణమే నిశ్చయమ్మది మానవునకు**
**బుద్ధిమంతుడై తన దేహమున్నయపుడె**
**తన్ను తా తెలియుట ధర్మతత్వ మరయ**
**సత్యమైనట్టి బాట శ్రీసాయి మాట!**

ఇదే మనం యిప్పుడు తెలుసుకొవలసినది. మానవత్వము మనకు ప్రసాదించాడు దైవము. మానవత్వములోని విశిష్టతను గుర్తించాలి.

**భగవన్నామమును హృదయంలో భద్రము చేసుకోవాలి**

జీవితమంతా గ్రంథాలు చదువుతూపోతే ఆచరించేదెప్పుడు? ఏమీ ప్రయోజనంలేదు. కాలము ఒక్క క్షణమైన చేతిలో నిల్చేదికాదు. ఎప్పుడో, ఎక్కడో, ఏ క్షణమో అనే విషయమును నిశ్చయంగా ఉంచుకొని మన కర్తవ్యము మనము నిర్వర్తించుకుంటూ పోవాలి. ఎందుకు పరులను అడుకోవాలి? అందరు భిక్షకులే! అందరికి ప్రసాదించేది భగవంతుడొక్కడే! ఆయనే అధికారి. అతనొక్కడే Master. అందువలనే తులసిదాసు చెప్పాడు. తన యింటికి రాజు ధనకనకవస్తువాహనాదులు పంపించినప్పుడు ఎవరికి యివ్వమని చెప్పాడు? అనాథలకు ఇవ్వమని చెప్పాడు. 'నేను అనాథనుకాదు. నాకు నాథుడున్నాడు, శ్రీరామచంద్రుడు. అతనికి ఎవరు నాథుడులేడు. అతనికి తీసుకుపోయి యివ్వండి' అన్నాడు. నాథునికి నాథ, అనాథనాథ. అతనే భగవంతుడు. రామభజనచేయి.

sri sathyasai vachanamrutam

దానిలో లభించే ఫలితము మరొక దానిలో లేదు. అలాంటి భగవన్నామాన్ని మన హృదయంలో భద్రము చేసుకోవాలి. ప్రాపంచిక సంబంధమైన నీ కర్తవ్యములను నీవు నిర్వర్తించుకో! దేనినీ నీవు వదలనక్కరలేదు. అయితే, నీవు మనిషి అనే భావము వదలాలి. నీవు మనిషికాదు. నీవు తొడుక్కున్న బుష్కోటు దేహము. ఇలాంటి బుష్కోట్లు ఎన్ని మార్చినావో. ఇదికాదు. ఈ దేహముగురించి నీవు బాధపడుతున్నావు.

**మనలోని దుర్గుణములను దూరము చేయాలి**

నీవు దేహముకాదు. 'I am God. నేను బ్రహ్మ. 'అహంబ్రహ్మాస్మి' ఈ విషయము స్వప్నములోకూడా మరువకుండా చుసుకోవాలి'. అందరూ బ్రహ్మస్వరూపులే! బ్రహ్మకు రెండవ పదార్థమేలేదు.'ఏకమేవ అద్వితీయం బ్రహ్మ'. Not two, only one. అలాంటి బ్రహ్మతత్త్వము పొందికూడా యింత అల్పత్వము మనం అనుభవిస్తున్నామంటే నిజంగా

**నొసటన్ వ్రాసిన వ్రాతకన్న కలదా నూరేండ్లు చింతిల్లినన్**
**ఎంత చదువు చదివి ఏరీతి ఉన్నను**
**నీచుడవగుణంబు మానలేడు**
**తరచి చదువు చదవ తర్కవాదమెగాని**
**పూర్ణజ్ఞానంబెపుడు పొందలేడు**

ఇట్టి భౌతికమైన లౌకికమైన ప్రాకృతమైన అనిత్యమైన అశాశ్వతమైన చదువు చదివి చదివి చావంగనేటికి చావులేని చదువు చదవవలయు. అంధుడగువాడెవ్వడీ అవనియందు? 'చదువు కల్గియు చెడు గుణములు విడువని వాడు అంధుడు', అన్నారు. చదువు ఉండినప్పుడు సరైన రీతిలో దానిని ఉపయోగించుకోవాలి. చెడు గుణములు దూరముగా నెట్టివేయాలి. అదియే త్యాగము. త్యాగమంటే ఏమిటి? ఇల్లువాకిలి ఆలుబిడ్డలు, అస్తిపాస్తులు వదలిపోవటం కాదు.

**మనసునందున్న దుర్భావములు వీడి**
**దుష్ట, అశాంతులను మరచిపోయి**
**యిట్టి గుణములు వీడిన త్యాగమగును**

srisathyasaivachanamrutam

**అదియె నిజమైన యోగమగును.**

ఆ యోగమే కర్మకౌశలం. అది మొట్టమొదట మనం తెలుసుకోవాలి. మనలోని దుర్గుణములు దూరం చేయాలి. దురభ్యాసములు దూరం చేయాలి. దురాలోచనలు దూరం చేయాలి. అటువంటివాని దగ్గరకు భగవంతుడు తానే స్వయంగా పరుగెత్తి పరుగెత్తి వస్తుంటాడు. అట్టి భగవంతుని ప్రేమించే వానిని భగవంతుడు అమితంగా ప్రేమిస్తూ వస్తాడు.

## నిజమైన భక్తునికొరకు భగవంతుడే వెతుకుతున్నాడు

ఒకానొక సమయంలో 'నేను భక్తులకు ఋణపడ్డాను' అన్నాడు, భగవంతుడు. ఎవరితో? లోకరీతిగా పార్వతితో అన్నాడు. పార్వతి అంటే ప్రకృతే! ప్రకృతితో చెప్పాడు పురుషుడు, 'నేను భక్తునికి ఋణస్తుడను'. 'ఏమిటి ఋణము? ఏమి తీసుకున్నావు?' అని అడిగింది పార్వతి. 'వారు నన్ను ప్రేమిస్తున్నారు. అంత విలువైనది నాకు ఇస్తున్నారు. కనుక, నేను మోక్షమనే వడ్డీ అతనికి చెల్లించాలి', అని చెప్పాడు. ఎలాంటిది? Interest బ్యాంకులలో యిచ్చే 14%, 13% కాదు. 100% యిచ్చాడు. అంత సిద్ధంగా కాచుకొని ఉంటాడు భగవంతుడు. కానీ ఆ సత్యము మీకు తెలియదు. ఆ రహస్యం మీకు తెలియదు. అందువల్లనే భగవంతుని ప్రేమ యిట్టిది, అట్టిదని ఎవరు వర్ణించగలరు?

'ఇక్కడ, అక్కడ, ఎక్కడ చూచినా ఒక్కడే! ఆత్మలో మక్కువ యుండును', అని బిసెంటు చెప్పింది. ఆమె బ్రిటీషులేడీ. ఇండియాలో ప్రతి ఒక్కడు భగవంతుడు భగవంతుడని సత్యాన్వేషణలో ప్రయాణమైపోతున్నాడు. నిజముగా భక్తుడు భగవంతుని వెతుకుతున్నాడా, లేక భగవంతుడు భక్తుని వెతుకుతున్నాడా? ఎక్కడ చూచినా ఉండిన భగవంతుని వెతికేది ఎందుకు? అయితే ఎక్కడచూసినా నిజమైన భక్తుడు కనిపించటంలేదు. కనుక నిజమైన భక్తునికొరకు భగవంతుడే వెతుకుతూ వస్తున్నాడు' అంది.

## భగవంతుని విశ్వసించినప్పుడే భగవంతుని సాక్షాత్కరింపచేసుకోవచ్చు

ఎదురుగా ఉన్నప్పుడు ఈ భక్తులు ఎంత నాటకమాడతారు! Twinkle twinkle little star,

sri sathyasai vachanamrutam

how I wonder what you are? ఎంత మెరుస్తారు నాముందు!

**పాపపుపని చేసి ఫలమాపద కలిగిన రోసి**
**కాపాడవు నీవంచు దోషము నాపైన మోపెదరోయి**

ఏమైనా అర్థముందా? యిలాంటివారిని భక్తులని చెప్పటానికి వీలవుతుందా? ఏమాత్రము లేదు. భగవంతునకు అర్పితము భక్తి. అంతా భగవంతునిదే, రెండవది లేనే లేదు. రెండోది ఉంటేకదా దానికి స్థానంకావాలి. భగవంతుని నిరంతరము స్మరించటం అంటే ఏమిటి? నేను బ్రహ్మ అనే యథార్థతత్త్వాన్ని నిరంతరము మరువకుండా జపించాలి. దేహానికి పేర్లు పెట్టుకొని తిరుగుతున్నారు. చాలా దగా పని. నేను ఫలాని రామయ్య అంటారు. నీ దేహము పేరు రామయ్య, నీవు రామయ్య కాదే! కానీ దేహము పేరు చెప్పుకొని బ్రతుకుతున్నావు. దేహము అనిత్యము. నీటిబుడగ వంటిది. ఎప్పుడు ఈ బుడగ పేలిపోతుందో! నీవు చెప్పుకొని తిరగవలసింది ఏమిటి? 'అహంబ్రహ్మాస్మి'. ఎక్కడైనా తిరుగు, నీవు. తప్పులు చేయకు. భగవంతుని నీవు విశ్వసించాలి. అప్పుడే భగవంతుని సాక్షాత్కరింపచేసుకోవచ్చు.

**ఎవరికి సేవ చేసినా ఆత్మకు సేవ చేసినట్లే!**

ప్రేమస్వరూపులారా! నిత్యము ఈ దేహసంబంధమైన విరక్తినిగూర్చి చెబుతుంటే కొంతవరకు మీకు బాధగా ఉండవచ్చును. కానీ ఇదే సత్యము. మెప్పులకోసమై రాలేదు. సత్యమును చెప్పటం నా కర్తవ్యము. సత్యమును ఆచరించటం నీ కర్తవ్యము. ఇక్కడ 4 రకముల సాధనలుంటున్నాయి, దాసునికి. భూశుభ్రత, భావశుభ్రత, దేహశుభ్రత, ఆత్మశుభ్రత. ఏమిటీ శుభ్రత? 'భగవంతుడు సర్వత్రా ఉంటున్నాడు' అనే సత్యము విశ్వసించి అన్ని ప్రదేశములు పరిశుభ్రంగా చూసుకుంటూపోవాలి. అందులో శారీరకంగా గోచరించే ప్రదేశంలో మరింత శుభ్రంగా ఉంటుండాలి. స్వామి ఉంటున్నాడు. స్వామి ఉన్నచోట శుభ్రంగా ఉండాలి. నిశ్శబ్దంగా ఉంటుండాలి. నిర్మలంగా ఉంటుండాలి. నిర్మోహంగా ఉంటుండాలి, నిరహంకారముగా ఉంటుండాలి యిదియే భూశుభ్రము. భావశుభ్రత. నీ భావము ఎట్టిదిగా ఉండాలి? భగవంతుడు సర్వవ్యాపకుడు. కరుణాస్వరూపుడు. ప్రేమప్రకాశకుడు. అగమ్యగోచరుడు. అప్రమాణుడు.

ఆనందస్వరూపుడు. ఈ విధమైన భావముతో నిరంతరము చింతిస్తూ రావాలి. ఏ విధంగా చింతిస్తావో ఆ రూపము సాక్షాత్కరిస్తుంది. దేహశుశ్రూత ఏమిటి? భగవంతుని దేహము సర్వత్రా ఉంటున్నాది. అతనికి తగిన సేవలు చేయాలి. అతనికి ఏది అవసరమో దాన్ని మనం శుభ్రం చేసుకుంటూ రావాలి. ఎక్కడ తిరుగుతాడు? ఎక్కడ పండుకుంటాడు? అతనికి అనుకూలమైనవి, ఆహారమునందించటము, సరైన సేవలు చేయటం దేహశుశ్రూత అన్నారు. ఆత్మశుశ్రూత? 'సర్వతఃపాణిపాదం..' అతనులేని స్థానంలేదు. ఎవరికి సేవ చేసినా ఆత్మకు చేయటమే? ఎవరితో ఆనందము అనుభవించినా అదే దైవముతో ఆనందము. నిజమైన ఆనందము దైవముతో ఉంటున్నాదిగానీ అన్యులతో చిక్కదు. అమ్మ, నాన్న, భార్య, పిల్లలు ఇవన్నీ క్షణికమైన ఆనందములు. కానీ నిత్యానందము ఒక్క దైవముతోనే ఉంటుంది. అట్టి ఆనందమునకు సేవ చేయాలి. అదే ఆత్మసేవ. ఈ విధమైన మానవత్వమును నిత్య జీవితములో మనం అభివృద్ధి గావించుకుంటూ పోతే నిజముగా మనకంటె మించిన దైవత్వము యింకోటి లేనేలేదు. మీరందరు దైవస్వరూపులే! ఆ సత్యము విశ్వసించి దైవస్వరూపము, దైవముయొక్క గుణములే మనము స్మరిస్తూ ఉండాలి.

**(తేదీ 02-09-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam